www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 21 అక్టోబర్ 2023

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

మండపేటలో మేరా మిట్టీ మేరా దేశ్

ప్రజాశక్తి-మండపేట

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలులో ఒకటైన మేరా మిట్టీ మేరా దేశ్ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి ఐదం రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.కార్యక్రమాన్ని వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరావు ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ఇంటింటికి వెళ్లి సేకరించిన మట్టిని ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా కలాం ఐఎఎస్ అకాడమీ 2023 క్విజ్ విజేతలకు వైస్ ఎంపిపి, ఎంఇఒ ఎం సిహెచ్.సోమిరెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు ఈతకోట కిన్నెర, పంచాయతీ కార్యదర్శులు వైసిపి రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, మండల పరిపాలన అధికారి వివిఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జెవివి' కృషి అభినందనీయం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జెవివి నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. జిల్లా కలెక్టర్ పేషీలో జిల్లా కలెక్టర్‌చే జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షులు చెకుముకి సైన్స మాసపత్రిక ఎడిటోరియల్ బోర్డు మెంబర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 33 సంవత్సరాలు గా జన విజ్ఞాన వేదిక విద్యార్థుల్లో సైంటిఫిక్ ఆలోచన కలిగించి, సైంటిఫిక్ జీవన విధానం అలవర్చుకునేందుకు కృషిచేస్తోందన్నారు. అందులో భాగంగా విద్యార్థి చెకుముకి సైన్సు మాసపత్రికను నడుపుతోందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ పత్రిక సర్క్యులేట్ చేయబడుతోందన్నారు. పిల్లలలో శాస్త్రీయ సామర్థ్యాలను వెలికి తీసేందుకు జన విజ్ఞాన వేదిక 33 ఏళ్లగా చెకుముకి సైన్సు సంబరాలను నాలుగు స్థాయిలలో నిర్వహిస్తోందన్నారు. నవంబరు 10న పాఠశాల స్థాయి, 30న మండల/పట్టణ స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, 2024 జనవరి 27, 28 తేదీలకత రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా మొహిద్దిన్ మాట్లాడేతై చెకుముకి సైన్సు సంబరాలను రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు ఇచ్చారని అన్నారు. జిల్లాలో అందరూ విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు విద్యార్థులను సైన్సు సంబరాల్లో పాల్గొనేట్లు చేయాలని, విద్యాభివృద్ధికి జన విజ్ఞాన వేదిక చేసే కృషికి సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి.సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. డి.ఖాజా మొహిద్దీన్, జిల్లా కోశాధికారి జి.త్రినాథ్ కుమార్, సీనియర్ నాయకుడు అబ్బిరెడ్డి రామకృష్ణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ బిఎన్.వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, జివి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

అమలాపురం ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు అయిన గ్రామ వార్డు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ల భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశం హాలులో మండపేట, రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మా ణాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన భవనాల శ్లాబులు, ఇటుక పని ప్లాస్టింగ్ టైల్స్ ఏర్పాటు, ఫినిషింగ్ వర్క్ పెయింటింగుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీర్లు కాంట్రాక్టు ఏజెన్సీల సమన్వయంతో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి నిర్దేశత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. భవన నిర్మాణాల్లో వెనుకంజులో ఉన్నవారు పనితీరు మెరుగుపరుచుకుని నిర్దేశిత గడువునాటికి భవనాల అప్పగించాలన్నారు. రాయవరం మండలం లో మాత్రం ప్రాధాన్యత భవన నిర్మాణాల్లో ఆశించిన పురో గతి ఉందని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ పి.సింధు, పంచాయతీరాజ్ ఎస్ఇ కె.చంటిబాబు, ఆయా మండ లాలకు చెందిన ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'లో 46 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గంలోని కె.గంగవరం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమానికి 46 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, ఆర్‌డిఒ పి.సింధులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న సమస్యలపై అర్జీదారులు రాతపూర్వకంగా స్పందన(జగన న్నకు చెబుదాం) కార్యక్రమం దష్టికి తీసుకువచ్చారన్నారు. ఇళ్ల మంజూరు, పింఛన్లు భూ సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాల సమస్యలకు సంబంధించి అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు పంచాయతీ రాజ్ ఎస్ఇలు కె.చంటిబాబు ఎంపిడిఒ ఎస్.శ్రీనివాస్, తహశీల్దార్ టి.వైద్యనాథ శర్మ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి కె.ప్రభాకరరావు, డిపిఒ వి. కష్ణకు మారి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ జివి.సత్యవాణి, డిఎస్ఒ ఎ.పాపారావు, డిఆర్‌డిఎ పీడీ డివి.శివశంకరప్రసాద్ డ్వామా పీడీ ఎస్.మధు సూదన్, జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి సిహెచ్. బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జెసి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దమనకాండ తగదు

నిరసన తెలిపిన సిపిఎం నాయకులు

అమలాపురంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి-అమలాపురం

పాలస్తీనాపై ఇజ్రాయిల్ భౌతిక దాడులు చేస్తూ సామాన్య ప్రజల ప్రాణాలను బలిగొంటున్న వైనాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయిల్ తీరుపై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద సిపిఎం నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు అంద్ర మాల్యాద్రి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. పాలస్తీ నా ప్రజల పై ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండించారు. దశాబ్దాల తరబడి పాలస్తీనా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ భౌతిక దాడులు చేస్తూ ప్రజల ప్రాణాలను బలిగొంటున్న ఇజ్రాయేల్ వైఖరిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నా, ఇజ్రాయిల్ ఈ దాడులకు తెగబడటం అన్యాయమని అన్నారు. అమెరికా తన ఆయుధాలను అమ్ముకునేందుకు యుద్ధోన్మాదాన్ని సష్టించి పలు దేశాల మధ్య వైరాన్ని పెంచి ఆయుధ వ్యాపారం చేస్తోందని ఎద్దేవా చేశారు. గల్ఫ్ దేశాల్లో చమురు నిక్షేపాలపై అమెరికా కన్ను పడిందన్నారు. వాటిని అడ్డంగా దోచుకునేందుకు యుద్ధాలను ప్రోత్సహిస్తోందని ఎద్దేవా చేశారు. గాజా యుద్ధ బాధితులందరికి ప్రజలంతా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి కోసం సిపిఎం నిరంతరం ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటి సభ్యులు జి.దుర్గాప్రసాద్, ఎన్.బలరాం, పీతల రామచంద్రరావు, నాయకులు వి.రాంబాబు, ప్రణీత్, దైవవాణి తదితరులు పాల్గొన్నారు

గ్రామాల్లో స్వచ్ఛత అందరి బాధ్యత

మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత మన బాధ్యత అనే కార్యక్రమం గ్రామాల్లోకి తీసుకువెళ్లి ప్రతి గ్రామంలోని అమలు చేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. ఆయన శుక్రవారం రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అంబటి భవాని అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కలిసి పనిచేయాలన్నారు. అదేవిధంగా గ్రామాలను చెత్తరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రెండు నెలల్లో విజయవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చిందన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు కొరత ఏర్పడిందని సచివాలయ సిబ్బంది రావడంతో ఆదనపు భారం పడిందని ఇప్పుడు మళ్లీ ఏ నిధులు ఖర్చు పెట్టాలని పలువుర ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. గ్రాంట్లు లేకుండా పనులు చేయలేమని ప్రజాప్రతినిధులు ముక్తకంఠం తో సమావేశంలో తెలిపారు ఈ కార్యక్రమానికి మండల పరిషత్ నిధులు ఇవ్వాలని వారంతా డిమాండ్ చేశారు. ఈనెల 22 స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో జరిగే సమావేశంలో ఈ విషయాలను మంత్రి దష్టికి తీసుకువెళ్లాలని ఎంపిపి భవానీ సభ్యులకు సూచించారు. వ్యవసాయ శాఖ ఎఇ సత్య ప్రసాద్ రైతులంతా ఇక్రాప్ నమోదు తో పాటు జిపిఎస్ చేయించుకోవాలన్నారు. అదేవిధంగా పలు ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపిటిసి సభ్యుల ను, సర్పంచ్‌లను పిలవడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎఇ ఏసురాజు, ఎంపిడిఒ కీర్తి స్పం దన, తహశీల్దార్ ఎం. వెంకటేశ్వర రావు, ఇఒపిఆర్‌డి ఎం.సల ట్ రాజు, ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి సభ్యునిపై దాడికి ఖండన

ఇటీవల తోటపేటలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రామచంద్రపురం జెడ్‌పిటిసి సభ్యుడు మెర్నిడి వెంకటేశ్వరరావుపై దాడి చేసిన సంఘటనను మండలపరిషత్ సమావేశంలో సభ్యులు ఖండించారు. ప్రజా ప్రతినిధిపై దాడిచేసిన దామిశెట్టి గంగా పురుషోత్తం, అతని కుమారుడు సత్యనారాయణమూర్తులపై చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-అయినవిల్లి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని శుక్రవారం హైదరాబాద్ సరూర్ నగర్ వాస్తవ్యులు పన్నాల లక్ష్మీ నరసింహం కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి నిత్యాన్నదాన నిధికి రూ.25,001 విరాళం ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు తెలిపారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వ చనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం బహూకరించారు.

భీమేశ్వరాలయానికి పోటెత్తిన విద్యార్థులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం విద్యార్థులు పోటెత్తారు. మాణిక్యంబా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శు క్రవారం సరస్వతి దేవీగా అమ్మవారిని అలంకరించి సరస్వతీ పూజ నిర్వహించారు. సరస్వతి పూజను పురస్కరించుకుని విద్యార్థులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. విద్యార్థులందరికీ పూజలో ఉంచిన పెన్నులను ఆలయ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ పి.తారకేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.

అమలాపురంలో దీక్షలు భగ్నం

- ఒపిఎస్ పునరుద్ధరణకు నిరవధిక దీక్ష చేస్తున్న 'యుటిఎఫ్'

ప్రజాశక్తి -అమలాపురం

జిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రెండవ రోజు కొనసాగిస్తున్న నిరవధిక నిరాహార దీక్షను, పోలీసులు భగ్నం చేశారు. ఉపాధ్యాయుల బిపి, షుగర్ లెవెల్స్ పడిపోతున్నాయని, దీక్షను విరమించాలని పోలీసులు కోరారు. అయినప్పటికీ దీక్షను కొనసాగించడంతో దీక్ష చేస్తున్న వారిని పోలీసులు ఆసుపత్రికి వామనాలపై తరలించారు. రెండో రోజు జరిగిన నిరవధిక దీక్షా శిబిరానికి సిపిఎం రాష్ట్ర నాయకులు ఆంద్ర మాల్యాద్రి విచ్చేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. సిపిఎం కమిటీ సభ్యులు బి.బలరాం, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కష్ణవేణి, జి.దుర్గాప్రసాద్, ఎన్.బలరాం, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు జి.దైవ కప, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు పి.అమూల్య తదితరులు శిబిరానికి విచ్చేసి పోరాటానికి మద్దతు తెలిపారు. అలాగే ఈ శిబిరానికి ఉత్తరాంధ్ర టీచర్ ఎంఎల్‌సి పి.రఘు వర్మ రాజు వచ్చి తమ మద్దతి తెలియ జేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన జిపిఎస్ విధానం ఎటువంటి గ్యారంటీ లేని పెన్షన్ విధానమన్నారు. ఇది ఉద్యోగుల పాలిట శాపంగా ఉందన్నారు. దీనిని ఉదోగ్య, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించినా ప్రభుత్వం మొండిగా జిపిఎస్‌ను అమలు చేయడం విచారకరం అని ఆ వేదన వ్యక్తం చేశారు. మరొక టీచర్ ఎంఎల్‌సి షేక్ సాబీ మాట్లాడుతూ కంట్రి బ్యూషన్ లేని పాత పెన్షన్ విధానమే ఉద్యోగులందరికీ శ్రేయస్కరమన్నారు. కాబట్టి సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒపిఎస్ పునరుద్ధరించే పార్టీకే భవిషత్తు ఎన్నికలలో మా జట్టు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, సీనియర్ నాయకులు డి.శ్రీరామ మూర్తి, జి .గోపాల కృష్ణ, రవి కుమార్, కాశీపతి, జిల్లా కార్య దర్శి జివి.రమణ, బిఎన్.వెంకటేశ్వర్లు మురుగేశ్వరరావు, బి.చంద్ర కళ, బిఎస్‌కె, జి. సుబ్రహ్మణ్యం, హెచ్ఎం.వెంకటరావు, సి.నారాయణమూర్తి, వివిధ మండలాల నుండి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండపేటలో దీక్ష చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కొత్తపేట దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న జ్యోతిబసు

అమలాపురంలో దీక్ష చేస్తున్న యుటిఎఫ్ నాయకుల దీక్ష భగ్నం చేస్తున్న పోలీసులు, చిత్రంలో నినాదాలుచేస్తున్న నాయకులు

సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేయాలి

మండపేట సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని రద్దుపరిచి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పాత తాలూకా కేంద్రాల వద్ద నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సహాధ్యక్షులు పి.సురేంద్ర మాట్లాడుతూ ఈనెల 18న రాష్ట్ర కేంద్రమైన విజయవాడలోనూ, 19న అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ప్రారంభించినటువంటి నిరవధిక నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతూ శుక్రవారం అన్ని పాత తాలూకా కేంద్రాల వద్ద వారికి మద్దతుగా నిరవధిక నిరాహార దీక్షను చేపట్టడం జరిగిందన్నారు. పాత పెన్షన్ పునరుద్ధరణ మాత్రమే తమకు ప్రత్యామ్నాయమని ఇతర ఏ రకమైనటువంటి పెన్షన్ విధానాన్ని ఆమోదించలేమన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఎవరైతే హామీ ఇస్తారో వారికి మాత్రమే మేము ఓటు చేయవలసినదిగా కూడా తీర్మానించడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాటను ఉదాహరించారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కె.గోపాలకష్ణారెడ్డి అధ్యక్షులు వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి రాజు, మండపేట, మండల పట్టణ, కపిలేశ్వరపురం నాయకులు ఎం.త్రినాథ్, బి.రామచంద్రా ఒడ్డి, కె. సత్తిబాబు, శ్రీనివాస్, రిటైర్డ్‌ఉపాధ్యాయులు గంటి వీర్రాజు, సిహెచ్.శ్రీహరిరావు, వి.దొరకయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కొత్తపేట** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పాతపెన్షన్ పునరుద్ధరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో పాత తాలూకా కేంద్రం కొత్తపేటలో శుక్రవారం జిల్లా కార్యదర్శి వై.మురళి ఆధర్యంలో ఒకరోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి, ఉత్తరాంధ్ర ఎంఎల్‌సి రఘువర్మ, గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, టిడిపి నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతి బస్, జిల్లా కార్యదర్శి బాలాజీ, మం డల ప్రధాన కార్యదర్శి జి.రామ్‌కుమార్, నాయ కులు ప్రసాద్, రవి, శ్రీనివాసు, సత్యనా రాయణ, బిఆర్‌కె.ప్రసాద్, రమణ, వెంకటేశ్వరరావు, పెన్షనర్ సంఘనాయకులు వై.సత్తిరాజు, ఏసేపు రామకృష్ణ పాల్గొన్నారు

సాయం అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అల్లవరం మండలానికి చెందిన కిడ్నీ బాధితుడు పోతుముడి ప్రేమ్ చంద్ చికిత్స నిమిత్తం శుక్రవారం అమలాపురంలో వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల యాజమాన్యం రూ.45 వేలు తక్షణ ఆర్థిక సాయం అందజేసింది. కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సేకరించిన మొత్తాన్ని బాధితుని తండ్రి శ్రీను కి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహారావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, వైస్ ఛైర్మన్ కరాటం ప్రవీణ్, ఎండి కె.శ్రావణ్ దీలిప్, డా.కె.హేమ విజిత, యాలంగి వరప్రసాద్, బి.శ్రీనివాస్, చోడే జాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కొత్తపేట

అవిడిలో నూతనంగా రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-1 భవనాన్ని, రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-2 భవనాన్ని, రూ.21.5 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ భాద్యతలు చేపట్టిన నాటి నుంచి ఒక వైపు రాష్ట్రంలో అనేక రకాల సంక్షేమ పథకాలను అమలుచేస్తూన్నారని అన్నారు. రాష్ట్రాన్ని అబివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు.

27 నుంచి ఎలక్షన్ సమ్మర్ రివిజన్

ప్రజాశక్తి-మండపేట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో 2024 ఎలక్షన్ సంబంధించి అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 12 తేదీ వరకు ఎలక్షన్ సమ్మర్ రివిజన్ నిర్వహిస్తున్నామని తహశీల్దార్ టిఆర్.రాజేశ్వర్ అన్నారు. ఈ నేపథ్యంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కొత్త ఓట్ల చేర్పులు, తొలగింపులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉంగరాల రాంబాబు, బిజెపి నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కొనసాగిన జగనన్న ఆరోగ్య వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు కొనసాగాయి. **మామిడికుదురు** మామిడికుదురులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎంపిపి కుసుమ వనజకుమారి సందర్శించారు. సర్పంచ్ గౌస్ మొహిద్దిన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ రియాజ్ హుస్సేన్, పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పిఎస్ విఎస్. ప్రసాద్, పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ కటకంశెట్టి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. **మండపేట** ఇప్పనపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి ఐదం రాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. గ్రామ సర్పంచ్ కుంచే వీరమణి, ఎంపిటిసి సభ్యులతో కలిసి గర్భిణులకు సామూహిక శీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ సత్యవేణి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, శానిటేషన్ సూపర్వైజర్ మగ్గం రాంబాబు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **ఆలమూరు** పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎంతో దోహదపడుతుందని కొత్తపేటనియోజకవర్గ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుమలత, ఎంపిడిఒ జాన్ లింకన్ అన్నారు. చెముడులంక గ్రామ సచివాయం-2 పరిధిలో సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఇఒపిఆర్‌డి రాజుకుమార్, డిటి జానకి రాఘవ కలిసి వారు పరిశీలించారు. అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి చెందిన ప్రత్యేక వైద్య నిపుణులతో పాటుగా స్థానిక వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార వంటకాలు, పండ్లు, కాయగూరలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వైసిపి నేతలు దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, దొండపాటి వెంకటేశ్వరరావు, బి.వీర వెంకట్రావు, దొండపాటి శ్రీను, మోటూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** కాలేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ దాయం కావేరి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిటిసి సభ్యురాలు శ్రీ సత్య మంజు, ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి తదితరులు ,పాల్గొన్నారు. **ఆత్రేయపురం** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమము ద్వారా గ్రామాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి సభ్యుడు బోనం సాయిబాబా, ఆప్కో డైరెక్టర్ కప్పల శ్రీధర్, ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. ర్యాలీ గ్రామంలో సర్పంచ్ లక్ష్మి అధ్యక్షతన డాక్టర్ ఎన్.సునీత పర్యవేక్షణలో వైద్య సేవలు అందించారు. **ఉప్పలగుప్తం** గోపవరం సచివాలయ పరిధిలో గోపవరం-సరిపల్లి గ్రామాల ప్రజలకు స్థానిక సర్పంచ్ కుంచే బుల్లియ్య ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు పాల్గొన్నారు.

ఇప్పనపాడులో అంగన్వాడీలో సామూహిక సీమంతం

చెముడలంకలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ జాన్ లింకన్

మామిడి కుదురులో ఐసిడిఎస్ పోషకాహార స్టాల్స్ పరిశీలిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

లైంగిక దాడికి యత్నం కేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్లు కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు. కాట్రేనికోన మండలం పల్లం గ్రామానికి చెందిన ఒంటరి మహిళపై పల్లంకుర్రు శివారు పోర గ్రామానికి చెందిన దొక్కాడి పెదకాశి రాజు 2018లో లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ క్రాంతి కుమార్ కేసు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో శుక్రవారం రాజమండ్రి 8వ జిల్లా జడ్జి ముద్దాయికి ఏడేళ్లకఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి బలి

ప్రజాశక్తి -దేవరపల్లి

డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఒక వ్యక్తి మరణించిన సంఘటన దేవరపల్లి మూడు రోడ్ల కూడలిలో శుక్రవారం చోటు చేసుకుంది. దేవరపల్లి సెంట్రల్ లైటింగ్ నిర్మాణంలో భాగంగా మూడు రోడ్ల కూడలి వద్ద పోల్ నిర్మాణ క్రమంలో భారీ క్రేన్ సాయంతో పోల్ నిలబెడుతున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ అజాగ్రత్త వల్ల అదే మార్గంలో వస్తున్న గౌరిపట్నం గ్రామానికి చెందిన కుంచం సత్యానందం(30)పై కరెంటు పోల్ పడిపోవడంతో అక్కడికక్కడే మరణించాడు. సత్యానందంకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు.

మిస్టరీగా మారిన వ్యక్తి అదృశ్యం కేసు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన వ్యక్తి అదృశ్యం కేసు మిస్టరీగా మారింది. పెద్దాపురం మండలం దివిలి చెందిన కాకి నందకుమార్ మొబైల్ వ్యాపారం, ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఫైనాన్స్ వ్యాపారంలో భాగంగా గురువారం గోకవరం బయలుదేరి వెళ్లాడు. మధ్యాహ్నం తాను ఇంటికి వచ్చేస్తున్నానని జగ్గంపేటలో ఉన్నానని బంధువులకు సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత ఏమైందో ఏమో తెలియదు. అతను తీసుకువెళ్లిన తమ్ముడి బైక్ జగ్గంపేట మండలం రామవరం శివారులో పడి ఉంది. చెర్లపల్లి చెందిన తమ్ముడు స్నేహితుడు అటుగా వెళ్తూ బైక్ చూసి తమ్ముడికి ఫోన్ చేశాడు. వెంటనే నందకుమార్ తమ్ముడు అక్కడికి చేరుకొని బైక్ ఆ ప్రదేశంలో ఉన్న చెప్పులను గమనించాడు. ఆ చుట్టుపక్కల ప్రదేశంలో వెతికి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బంధువులు చుట్టుపక్కల ఉన్న, కాకినాడ, రాజానగరం ఆసుపత్రులను పరిశీలించారు. దీంతో అదృశ్య కేసు నమోదు చేశారు. శుక్రవారం రామవరంలోని సిసి కెమెరాలను పోలీసులు పరిశీలించారు. ఆ సిసి కెమెరాల్లో అటు వైపుగా బైకుపై వెళ్లినట్టు కనిపించకపోవడంతో ఆ వాహనం అక్కడికి ఎలా వెళ్లింది అనేది మిస్టరీగా మారింది. పోలీసులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలంలోని గ్రామాల్లో ఎస్ఇబి అధికారులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సిఐ పి.అశోక్ తెలిపారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశ పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకన్నదొర, ఎ.రాజు, రాంబాబు, ఎం.వీరభద్రరావు, జ్యోతి ఉన్నారు.

సిఎంగా జగన్‌తో ప్రజా సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి - పెద్దాపురం

సిఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ద్వారానే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని అమ్మవారి కళ్యాణ మండపంలో వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన 'జగనే సిఎం ఎందుకు కావాలంటే' కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడారు. సమావేశంలో చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, విజ్జపు రాజశేఖర్, ఆరెళ్ల వీర రాఘవ, పప్పల దుర్గారావు, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, గుహ సారధుల పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలోని శోభా థియేటర్ వీధి నుంచి మసీదు సెంటర్ వరకూ రూ.13 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణానికి శుక్రవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ వార్డులో గుర్తించిన సమస్యల పరిష్కారానికి మంజూరు చేసిన నిధులతో ఈ డ్రైన్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ డిఇ ఆదినారాయణ రావు, ఎ.వనజ, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ అమీనా, ఆరెళ్ల వీరరాఘవ, కో ఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ పాల్గొన్నారు.

రూ.2 కోట్ల రైతు నేస్తం రుణాల పంపిణీ

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నాగులపల్లి సొసైటీ ద్వారా రూ.రెండు కోట్ల రైతు నేస్తం రుణాలను 19 మంది రైతులకు పంపిణీ చేసినట్లు సొసైటీ అధ్యక్షులు అబ్బిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. నాగులపల్లి సొసైటీ అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఈ ఏడాది లాభాల్లో రైతుల షేర్ ధనం, డివి శాతం డివిడెండ్‌ను రైతుల ఖాతాలలో జమ చేసినట్లు చెప్పారు. సొసైటీ అభివృద్ధికి సహకరిస్తున్న పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు, బ్యాంకు సిఇఒ సిహెచ్.నాంచారారావు, బ్యాంకు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యానాం వార్తలు

కలశంను ప్రదర్శిస్తున్న ఎంఎల్ఎ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి

యానాంలో 'మేరీ మిట్టీ మేరీ దేశ్'

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా శుక్రవారం అమత్ కలశ యాత్రను స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కలశంలో వేసి విద్యార్థులు, యువత యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశం, ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పి.లక్ష్మణ ప్రవీణ్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు, ఎన్‌సిసి ఆఫీసర్లు, జవహర్ నవోదయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం చిల్డ్రన్స్ ఆడిటోరియంలో మాజీ సైనికులు జివిస్. సాయి బాబు, కె.మాణిక్యాలరావు, ఎన్.వెంకటరమణను ఎంఎల్ఎ సత్కరించారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడాకారులకు యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కిట్లును పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక ఇండోర్ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అథారిటీ అధికారులు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లిని సత్కరించారు.

డ్వాక్రా రుణాల మంజూరుకు చర్యలు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని అన్ని డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ మేరకు డిఆర్‌డిఎ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌ను కలిసినట్టు తెలిపారు. గతంలో గ్రూపునకు రూ.ఐదు లక్షల చొప్పున రుణాలు మంజూరు చేశారని, ప్రస్థుత పరిస్థితుల దృష్ట్యా ఒక్కో గ్రూపునకు రూ.10 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను కోరినట్టు ఆయన తెలిపారు. గతంలో 23 గ్రూపులకు రుణాలు మంజూరు చేశారని, ప్రస్తుతం 438 గ్రూపులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. రుణాలు కోసం డ్వాక్రా మహిళలు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్నారని, త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని ఎంఎల్ఎ డైరెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ హామీ ఇచ్చినట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి తెలిపారు.

240 మందికి కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇటీవల కంటి ఆపరేషన్లు చేయించుకున్న 240 మంది రోగులకు ఉచితంగా కళ్ళజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. సామర్లకోట మండలం ఉండూరులో ఈ నెల 2న పంతం సీతారామ బాలాజీ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న ప్రజలకు జనసేన నాయకులు కళ్ళజోళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సరోజ వాసు, యువత పాల్గొన్నారు

మామిడికుదురులో జరిగిన 'బాబుతో నేను' కార్యక్రమం

టిడిపి ఆధ్వర్యంలో 'బాబుతో నేను'

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం బాబుతోనేను కార్యక్రమం నిర్వహించారు. వివరాలు ఇవి..

మామిడికుదురు రాష్ట్రంలో కక్ష సాధింపు పాలన కొనసాగుతోందని దానికి ముగింపు రోజు దగ్గరలోనే ఉందని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జనసేన మండల శ్రేణులతో కలిసి బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెదపట్నంలంక సర్పంచ్ సుందరనీడి రాజేష్ కుమార్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బోనం బాబు, ఈలి శ్రీనివాసరావు, చుట్టుగుళ్ళ కిషోర్, కడలి నూకరాజు, సుధా బాబ్జి, జాలెం శ్రీనివాసరావు, బందెల పద్మ, వర్జినేని వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలు విడనాడి చంద్రబాబు పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. కపిలేశ్వరపురంలో బాబుతో నేను కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత గ్రామంలో అంబేద్కర్, ఎన్.టి.ఆర్., విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తోందని, అభివృద్ధి లేక అధిక ధరలతో సామాన్యులు విలవిలలాడుతున్నారని మాజీ ఎంఎల్ఎ, అమలాపురం నియోజకవర్గ టిడిపి ఇన్ చార్జ్ అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు గొల్లవిల్లిలో శుక్రవారం టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ స్వగృహం వద్ద టిడిపి క్లస్టర్ సమావేశాన్ని క్లస్టర్ ఇన్ ఛార్జ్ లంకే భీమరాజు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ నల్లా బాబండి, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మిలేరులో టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-ఆలమూరు

మాజీ సిఎం చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులకు నిరసనగా టిడిపి నాయకులు శుక్రవారం గుమ్మిలేరులో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులంతా బస్టాండ్ సెంటర్లో ఒంటి కాలిపై నిల్చుని వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన ప్రత్యేక హోదా సాధన, పోలవరం పూర్తి, సిపిఎస్ రద్దు, అమరావతి నిర్మాణం, జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల వంటి ముఖ్యమైన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపద సమయంలో అండగా నిలుస్తాం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

భువనేశ్వరితో టిడిపి నాయకులు

మాజీ సిఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని రాజమహేంద్రలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ, మండలానికి చెందిన టిడిపి నాయకులు కలిశారు. చంద్రబాబు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన నాటి నుంచి చంద్రబాబుకు మద్దతుగా తాము చేస్తున్న ఆందోళనలు, పోరాటాలను ఈ సందర్భంగా భువనేశ్వరికి వివరించారు. ఈ ఆపద సమయంలో తామంతా అండగా నిలుస్తామని తెలిపినట్టు లక్ష్మీనారాయణ తెలిపారు. భువనేశ్వరిని కలిసిన వారిలో నాయకులు మంచెం బాబీ,గొలకోటి చిన్న,ఆకేటి పెద్ద,ఆకేటి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి

పరికరాలు అందజేస్తున్న ఎంపీలు, ఎంఎల్ఎ, కలెక్టర్

ప్రజాశక్తి-గొల్లప్రోలు (పిఠాపురం), పెద్దాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతరంగం విశిష్టతను గుర్తించి చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పరికరాలు చేనేత కళాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పిఠాపురం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి గుడి దగ్గర బత్తుల మురళి కళావేదిక వద్ద జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ సంజీవ్ కుమార్, కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పాల్గొన్నారు. గొల్లప్రోలు క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం నిధులతో మంజూరైన చేనేత పరికరాలు, సోలార్ లైటింగ్ యూనిట్స్‌ను చేనేత కార్మికులకు అందజేశారు. చేనేత కళాకారులకు వైఎస్సార్ చేనేత పింఛన్ పత్రాలతో పాటు శిక్షణ పొందిన వీవర్స్‌కు గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు చేనేత క్లస్టర్‌కు సంబంధించి తాటిపర్తి గ్రామంలో సుమారు 400 మంది చేనేత కుటుంబాలతో మమేకమైన గొప్ప అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. చేనేత కార్మికులు గతంలో చాలా దుర్భరమైన జీవితాన్ని గడిపే వారిని ఆయన అన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందును గుర్తించి వారి అభివద్ధికి కృషి చేస్తునాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నేతన్నలకు ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చే విధంగా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ప్రతి ఏటా రూ.24 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని, 16 చేనేత కులాలకు సంబంధించిన నాలుగు ప్రత్యేక కార్పొరేషన్లు కూడా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎంపీ తెలిపారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గొల్లప్రోలు చేనేత క్లస్టర్ అభివద్ధి నిమిత్తం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.101 లక్షలకు సంబంధించి తొలి దశగా రూ.30 లక్షల విలువైన చేనేత పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ పరికరాలతో మంచి నాణ్యమైన ఉత్పత్తులను, వేగంగా అందించేందుకు నేతన్నలకు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. ఇందులో 38 మగ్గం ఉపకరణాలు, 259 సోలార్ లైటింగ్ యూనిట్స్‌ను 90 శాతం సబ్సిడీపై చేనేత కార్మికులకు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. దేశ సరిహద్దుల్లో పని చేస్తున్న జవాన్, వ్యవసాయం చేస్తున్న రైతులు చాలా శ్రమ పడుతున్నారని, చేనేత రంగంలో నేతన్నలు చేస్తున్న కృషి చాలా విలువైనదని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ఆర్‌డిడి బి.ధనుంజయ్ రావు, కె.పెద్దిరాజు, ఎడిఒ డి.రాంబాబు, గొల్లప్రోలు మండలం ఎంపిపి రామన్నదొర, జెడ్‌పిటిసి వి.నాగలోవరాజు, ఎఎంసి చైర్మన్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు. చేనేత పరిశ్రమను పరిరక్షించి చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించాలని కర్నూలు ఎంపీ ఎస్ సంజయ్ కుమార్‌కు ఆప్కో మాజీ డైరెక్టర్, చేనేత సొసైటీ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో చేనేత క్లస్టర్లను ప్రారంభించిన కర్నూలు ఎంపీ సంజయ్ కుమార్,కాకినాడ ఎంపీ వంగా గీత శుక్రవారం రాత్రి పెద్దాపురం మెయిన్ రోడ్డులోని చేనేత సొసైటీని సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు తయారుచేసిన చేనేత వస్త్రాలను వారు పరిశీలించారు. కార్మికుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. అనంతరం వీర్రాజు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ చంద్రకళ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, చేనేత జౌళజ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెద్దిరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరెళ్ల వీర రాఘవ, కట్టా రాజబాబు, పప్పల దుర్గారావు, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, గాంధీ చేనేత సొసైటీ అధ్యక్షుడు తూతిక సత్యనారాయణ, సొసైటీ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాలకి కృషి చేయాలన్నారు. ఎంపిటిసి జాగు వీరభద్రరావు, చదలాడ సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి మాట్లాడుతూ కాకినాడ-తామరాడ ఆర్‌టిసి బస్సును పునరుద్ధరించమని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఏటుపట్టు గ్రామాల నుంచి కాకినాడ ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు ఈ బస్సు సౌకర్యం లేక ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. వైస్ ఎంపిపి మిర్యాల రాజా మాట్లాడుతూ నెల రోజుల్లోగా బస్సును పునరుద్ధరించాలని, అందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కాంద్రకోట సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలపై ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 24 గంటలూ వీధిలైట్లు వెలుగుతున్నా పట్టించుకున్న వారు లేరన్నారు. ఎంపిపి సత్యవతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుత సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు వజ్రపు జితేంద్ర, ఎంపిడిఒ అశోక్ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు బిక్కిన శేషకుమారి, రాజశేఖర్, మండల విస్తరణ అధికారి మూర్తి, ఎంఇఒ సత్యనారాయణ, వ్యవసాయ అధికారి సంజయ్ కుమార్, సిడిపిఒ జి.ఉష, ఉద్యానవన అధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న చేస్తున్న ప్రతినిధులు

బాలమందిరం దసరా ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. శుక్రవారం మాధవపట్నం బాలమందిరంలో జరిగిన సభకు పంచాయితీ వార్డు మెంబర్ తోలుం లోవరాజు అధ్యక్షత వహించారు. సంఘమిత్ర అధ్యక్షుడు మహ్మద్ ఖాజా, సంఘమిత్ర కోశాధికారి శ్రీప్రకాష్ రావు, బాలమందిరం అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు. డిసెంబర్ నెలలో బాలమందిరం 8వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తామని అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A. No. 6/2020 in O.S. No. 586/2020

Between:

Meesala Srinivas, S/o. Subbarao, age 36 yrs, Cultivation and Business, Hindu, D.No. 2-130, Pedda Veedhi, Pandalapaka Village, Bikkavolu Mandal, East Godavari District, Pin: 533345, Anaparthi JCJC Limits.

...Petitioner/ Plaintiff

AND

1. Marrapu Prasanna, W/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 43 yrs, Hindu, House wife, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.

2. Marrapu Mothik Kumar, S/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 25 yrs, Hindu, Business, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.

3. Marrapu Lohit, S/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 43 yrs, Hindu, House wife, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.

...Respondents/ Defendants

పై నంబరు పిటిషన్‌లో 1, 2, 3 రెస్పాండెంట్లు/ ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 09-11-2023** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 18-10-2023

Md.M.చిస్తి
అడ్వకేట్, రాజమండ్రి

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -అయినవిల్లి

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. నేదునూరులో రూ.40 లక్షల వ్యయంతో గడప..గడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులులో భాగంగా సిపి రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఎంఎల్ఎ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారుల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. అనంతరం మాగం గ్రామంలో ఐసిడిఎస్ నిధులు రూ.38 లక్షల వ్యయంతో నిర్మించిన కేశవ స్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నూతన భవనాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు.కార్యక్రమాలలో నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, మాగం సర్పంచ్ కాశి సత్యనారాయణ, మాగం సొసైటీ అధ్యక్షులు సుబ్బరాజు, ఎఎంసి చైర్మన్ వేటుకూరి వెంకటరాజు, జెఎస్ అధ్యక్షుడు పులిదిండి ప్రభాకర్,అయినవిల్లి మండల అధ్యక్షుడు కుడిపూడి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మాగం గ్రామంలో సొసైటీ భవనం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

మామిడికుదురు గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల ఆధునికీకరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. పెదపట్నం లంకలో పలు సిసి రోడ్లు ఆధునికీకరణ పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి రాజేష్ కుమార్, కొమ్ముల రాము, కొమ్ముల సూరిబాబు, విప్పర్తి నాగేశ్వరరావు ,తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మండపేట

జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్, రిల్ మేకింగ్, డ్రామా పోటీల్లో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించారు. శుక్రవారం విజేతలు జాహ్నవి, రేష్మ రమ్య, గుణ, రమేష్, అలేఖ్యలను స్థానిక డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో వక్ష శాస్త్ర, అర్థశాస్త్ర అధ్యాపకులు చాపల అభినయ్, జె.నెహ్రూ నాయక్, ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు, రిబ్బన్ క్లబ్ చైర్మన్ ఎ.ఆనందరావులు సర్టిఫికెట్లు బహూకరించి అభినందించారు.

వైఎస్ఆర్ ఆసరా మంజూరు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్ఆర్ ఆసరా మంజూరు పత్రాల పంపిణీ చేశారు. చొప్పెల్ల, మూలస్థానం అగ్రహారం గ్రామాలకు చెందిన సత్యసాయి, సాయిలక్ష్మి మహిళా సంఘాలకు చెందిన ఆసరా పథకం రూ.4.87 లక్షల సొమ్ము సాంకేతిక కారణాల వల్ల విడుదల నిలిచిపోయింది. దీనిపై స్పందించిన ఎంపిపి తొరాటి లక్ష్మణరావు, ఎంపిడిఒ కె.జాన్ లింకన్ సంబంధిత రికార్డులను పరిశీలించి సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో జిల్లా వైఎస్ఆర్ వెలుగు శాఖ నిలిచిపోయిన సొమ్ము మొత్తాన్ని మంజూరు చేసింది.

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో సర్పంచ్‌కు అవమానం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కాలేరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో తమకు అవమానం జరిగిందంటూ ఆ గ్రామ సర్పంచ్ దాయం కావేరి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ అధ్యక్షతన జరగవలసిన కార్యక్రమానికి ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి తనను స్టేజ్ పైకి పిలవడం జరిగిందన్నారు. అయితే తనను పక్కన పెట్టి ఉప సర్పంచ్ ను పిలిచి మాట్లాడమని చెప్పడంతో సభ నుంచి తాను దిగి బయటకు వచ్చేసినట్లు తెలిపారు. ఈ విధంగా చేయడం పట్ల తమకు తీరని అవమానం జరిగిందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.

వాకతిప్పలో ఉపాధి హామీ గ్రామసభ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వాకతిప్ప గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోరిపెల్ల వెంకట నాగస్రవంతి అధ్యక్షతన జరిగిన జరిగిన సభలో ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ వెంకటలక్ష్మి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో చేపట్టవలసిన ఉపాధి పనుల ప్రణాళిక నివేదిక వివరించారు. గ్రామంలో పనులు చేపట్టేందుకు చర్చలు జరిపారు. గ్రామ పరిధిలో చేపట్టబోయే పంటబోదెలు, కాలువల పూడికతీత, చెరువులకు సంబంధించి 53 పనులు, గుర్తించినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ టి.గణేష్ తెలిపారు. గుర్తించిన పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనన్నట్లు ఎపిఒ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు, కార్యదర్శి యశ్వంత్ కుమార్, ఫీల్డ్అసిస్టెంట్ తనుకు గణేష్, సచివాలయ సిబ్బంది, వారంటీర్లు, ఉపాధి మేట్లు, కూలీలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు

పేరు మార్పు

తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం, చీపురుపల్లి గ్రామం, డో.నెం.2-199రు కాపురస్తులు చిలకాని ముత్యాలయ్య గారి కుమారుడు చిలకాని అబ్బులు అనే చిలకాని నల్లబ్బులు తెలియజేయునది ఏమనగా ప్రస్తుతం నా ఆధార్ కార్డు నందు నా పేరు **చిలకాని నల్లబ్బులు** గా ఉంది. కావున ఇకపై నా పేరును **చిలకాని అబ్బులు అనే చిలకాని నల్లబ్బులు** గా పరిగణించవలెనని తెలియజేయుచున్నాను.

చిలకాని అబ్బులు అనే చిలకాని నల్లబ్బులు
డో.నెం. 2-199, చీపురుపల్లి గ్రామం, సీతానగరం మండలం, తూర్పు గోదావరి జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 586/2020

Between:

Meesala Srinivas, S/o. Subbarao, age 36 yrs, Cultivation and Business, Hindu, D.No. 2-130, Pedda Veedhi, Pandalapaka Village, Bikkavolu Mandal, East Godavari District, Pin: 533345, Anaparthi JCJC Limits.

...Plaintiff

AND

1. Marrapu Prasanna, W/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 43 yrs, Hindu, House wife, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.

2. Marrapu Mothik Kumar, S/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 25 yrs, Hindu, Business, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.

3. Marrapu Lohit, S/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 43 yrs, Hindu, House wife, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.

...Defendants

పై నంబరు దావాలో 1, 2, 3 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 09-11-2023** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 18-10-2023

Md.M.చిస్తి
అడ్వకేట్, రాజమండ్రి